అంతరాలు

'కావ్యశ్రీ'

ఆ యింటికి వెళ్ళినతర్వాతకూడా యింకా వెళ్ళకూడదనే అనుకొంటున్నాడు జగన్నాథం. "విశ్వం తన కెంత ప్రాణస్నేహితుడయితే మాత్రం అతను చేసిన పనిని తానెలా అంగీకరించగలడు? ఆ అమ్మాయి యెంత అపురూప సౌందర్యవతి అయితే మాత్రం లేవదీసుకొచ్చి కాపురం పెడతాడా? పేరు పొందిన కళారాధకుడై కూడా అంత అవినీతిగా ప్రవర్తించాడనేగా తానింతవరకూ అతని ముఖం చూడకుండా వూరుకొన్నాడు! అతని చిత్రాలు ప్రపంచాన్నే ఉర్రూతలూగిస్తున్నాయని మురిసిపోదామంటే ప్రాణమిత్రుడు చేసిన యీ సిగ్గులేని పనికి తానెలా సిగ్గుపడకుండా వుండగలడు? ఆదర్శజీవితాన్ని గడుపుతాడనుకొన్న ఆప్తమిత్రుడు—తోటి కళారాధకుడు అంత అవినీతికరంగా ప్రవర్తించినందుకు నిజంగా తానెంత బాధపడ్డాడు!" అని అనుకొంటూనే ఆ యింటిముందాగిన జగన్నాథానికి "విశ్వం—ఆర్టిస్టు" అన్న సైనుబోర్డు చిరునవ్వుతో స్వాగతం చెప్పింది. ఇక జన్మలో విశ్వం ముఖం చూడకూడ దనుకొన్న జగన్నాథం వేరే పనిమీద ఆ వూరు వచ్చి విశ్వం యింటికి రాకుండా వుండలేకపోయాడు! మెట్లు లెక్కి, వేసివున్న తలుపు తట్టాడు! జవాబు లేదు. "విశ్వం" అని గొంతెత్తి పిలవటానికి యెందుకో బిడియపడి చివరకు తప్పని సరిగా పిలిచాడు. ఎవరూ పలక లేదు. నిరుత్సాహంతో బోర్డు వంక చూచి మెట్లు దిగుతున్నాడు: తలుపులు తెరచిన చప్పుడు విని వెనక్కి చూశాడు, వెంటనే ఆశుకవిత్వంలో ఓ పద్యం చెప్పాలనిపించింది జగన్నాథానికి. తెరచిన తలుపులు పట్టుకొని గుమ్మం మధ్యగా నిలబడి కౌటుకళ్ళతో చిరునవ్వు నవ్వుతూ వున్న ఆ ప్రాణమున్న చిత్రపటాన్ని చూచేటప్పటికి "విశ్వం" పొరపడలేదేమో అనిపించింది జగన్నాథానికి! భర్తను విడిచి మరొకడిని వలచిన స్త్రీ యెంత అందకత్తె అయితే మాత్రం తానెలా హర్షిస్తాడు. ఆదర్శాలు, ఆశయాలు అందానికి ఆనందానికి బలిచేసేటంత పిరికివాడా తను? మరి తనకంటె ధీరు డనుకొన్న విశ్వం యెలా పాల్పడ్డాడీ అవినీతికి! తన గుండెముందు అతనిగుండె యెంత పిరికిదో అని సన్నగా నవ్వుకొన్నాడు జగన్నాథం!

ఇంకా మాట్లాడుతాడు ఇంకా మాట్లాడుతాడు అని చూస్తున్న ఆ అమ్మాయికి జగన్నాథం నవ్వు వింతగానే వుంది. అయినా ముక్కూ మొగమూ తెలియని పెద్దమనిషి—అందులోనూ తన యింటికివచ్చి. తన భర్తను చనువుగా పేరుపెట్టి పిలవగలిగిన భర్తస్నేహితుని మరోలా భావించటం భావ్యంకాదని తాను కూడా చిరునవ్వుతోనే అడిగింది.

"ఎవరికోసమండీ?"

"విశ్వం లేడా?"

"లేరు; బందరు వెళ్లారు"

"ఎప్పుడొస్తాడు?"

"రేపురాత్రికి"

అతను మాట్లాడకుండానే మరో మెట్టుదిగాడు. ఆమె అనుమానిస్తూ అడిదింది.

"మీ పేరు?"

"జగన్నాథం"

ఇంకా అతని సమాధానం పూర్తికాకుండానే ఆమె కౌటుక కళ్ళు తళుక్కుమన్నాయి.

"నమస్కారం"

తామరకళికవంటి ముకుళిత హస్తాంజలి చూచి—వినీలరోదసీకుహర విభాసితవినిర్మల తారకాజ్యోత్స్నల్లాంటి నేత్రాలు చూచి కవితాభావాలతో కవ్వి పోతూవుంది జగన్నాథం మనసు.

"లోపలకురండి"

ముందు నడిచిందావిడ! ఆలోచించకుండానే అనుసరించాడు. నల్లద్దాల కళ్ళజోడుతీసి ఖద్దరులాల్చీ ప్రక్క జేబులో పెట్టి పంచె కుచ్చెళ్ళు సవరించుకొని తోలుసంచీ ప్రక్కను పెట్టుకొని సోఫాలో కూర్చున్నాడు జగన్నాథం!

"మిమ్మల్ని యెప్పుడూ చూడకపోయినా బాగానే పోల్చుకోగలిగాను." కిలకిలా నవ్వింది.

"ఎలాగ?" విస్తుపోతూ అడిగాడు.

"మీగురించి మావారు చాలా చెప్పారు. రోజూ చెపుతూనే వుంటారు. నా గురించే నటగా రావటం మానేశారట. వీరు మీ స్నేహితుని తిడుతూ వ్రాసిన ఉత్తరం యింకా నా దగ్గర జాగ్రత్తగానే వుంది" వయ్యారంగా నవ్వింది. కానీ జగన్నాథానికి బాధగానే వుంది. రాకుండావుంటే బావుండుననుకొన్నాడు. కానీ వచ్చేశాడుగా! బలవంతంగా వెకిలిగానవ్వాడు. "కూర్చోండి—కాఫీ కలుపుకొస్తాను" అంటూ వంట యింట్లోకి నడిచిందావిడ! తనకున్న అభిప్రాయాలు పూర్తిగా మార్చుకోవాలేమో అనుకొంటున్నాడు జగన్నాథం! అంత సంస్కృతి ఆ సౌందర్యం విశ్వంచేత యింతే కాదు ఇంకెంత పనినైనా చేయించగలదను కొన్నాడు కాని ఆమెపతిత! పైగా పెళ్లాడినభర్తకు ద్రోహం చేసి లేచివచ్చిన నిందిత! అందుకు ఆమెను గాని విశ్వాన్నిగానీ తాను క్షమించలేడు! కళద్వారా లోకంలోని కుళ్ళును కళంకాన్ని కడిగివేయాలని దృఢసంకల్పంగల విశ్వం యింత పిరికిగుండెవాడని తానెప్పుడైనా అనుకొన్నాడా? ఇంకొకింత అందముంటే మాత్రం తానలా చేస్తాడా? ఎన్నడూ చేయడు.

ఆలోచనలకు అంతరాయం కలిగించేయి ఆమె పలుకులు. "కాఫీ తీసికోండి" కాఫీ కప్పు అందించి యెదురుగావున్న సోఫాలో కూర్చుంది.

"చూస్తారేం? త్రాగండి! నాచేత్తో యిచ్చింది త్రాగరా" యెగతాళిగా చూచి నవ్వింది. ఆమాపులో వాడిదనం జగన్నాథానికి అర్థమైనట్లుంది. మాట్లాడకుండా కప్పు కాళీచేశాడు.

"అర్జంటుగా రమ్మని టెలిగ్రాం వస్తే బందరు వెళ్లారు. రేపు వచ్చేస్తారు. మీ స్నేహితులు లేరుకదా అని మీ రేమీ అనుమానించనక్కరలేదు. నేనూ మీ స్నేహితురాలినే" అంటూ కులాసాగా నవ్వి—వంగి జారిన పైటను సర్దుకొంటూ తాను కాళీచేసిన కాఫీ కప్పును అందుకొంటూ తనవంక అదోలా చూచి లేచి వెళ్ళిపోతూవున్న ఆమెను చూస్తే జగన్నాథానికి యెందుకో అసహ్యమనిపించింది. చక్కటి శృంగార ప్రబంధంలో కథానాయిక కుంటిదయినట్టుగా బాధపడ్డాడు. అంతలోనే ఆవిడ తిరిగివచ్చి కూర్చుంది.

"మీ కథలన్నీ చాలా చిత్రంగా వుంటాయండీ"

"ఏమిటి చిత్రం?"

"మీ కథల్లోని ఆడవాళ్ళంతా యెరిగివున్న వాళ్ళులా కనిపిస్తారు"

"ఎరిగివున్న వాళ్ళ గురించే వ్రాస్తాం గనుక"

ఆవిడ ఒకసారి పైట సర్దుకొని గట్టిగా నిట్టూర్చింది.

"క్రిందటివారం మీ "అనుభూతులు" కథలోని నాయిక— 'రత్న'ను మీ రెరుగుదురా?" వెలవెలబోయిందావిడముఖం.

"ఫలానావ్యక్తి అని నేనెప్పుడూ యే పాత్రనూ సృష్టించను. కానీ చూచిన వ్యక్తుల అభిరుచులు అలవాట్లు నైతికవిలువలు ఆధారంగా కథలు వ్రాస్తుంటాను. అంతే"

ఆమె ఒకసారి అతని కళ్ళల్లోనికి సూటిగా చూచి ముఖం త్రిప్పుకొని చాటుగా నవ్వింది.

"మీ పేరు చెప్పారుకారు" సంకోచిసూ అడిగాడు.

"అడగకుండా నే చెప్పమంటారా?" ఆ నవ్వులోని వెటకారాన్ని చూచి సిగ్గుపడ్డాడు జగన్నాథం.

"నా పేరు రత్నకుమారి. మొన్న మీ కథలోని రత్నను చూచినప్పటినుంచీ మా వారు నన్ను రత్నా అనే పిలుస్తున్నారు" చిన్నగా నవ్వి మళ్లా అంది." "చూశారా మీ కథ ప్రభావం యెంతబలంగా పనిచేస్తువుందో". ఈ సారి జగన్నాథంకూడా ఆమెతోపాటు గొంతు కలిపి నవ్వాడు.

"మీ కథ మా గురించే వ్రాశారేమో అనుకొన్నాం"

"అలాగని చాలమంది అనుకొంటూ వుంటారట."

"మీ కథలంటే నాకు చాల యిష్టం"

"సంతోషం"

మూడు వారాలక్రితం వచ్చిన కథ "ఒక రాత్రి"లో కథానాయికను అంత తేలిగ్గా చూపించారేం?

"ఎందుకలా అనుకొంటున్నారు?

"అంతకుముందేమాత్రం పరిచయమైనా లేకుండా ఒక రాత్రి తమ యింట్లో పడుకొన్న మగాడితో యెంత యెటువంటి ఆడదైతే మాత్రం అంత అలా ప్రవర్తిస్తుందంటారా?"

"ఇటువంటి విషయాలు మన మిద్దరం చర్చించటం సమంజసం కాదనుకొంటాను."

"ఫరవాలేదు చెప్పండి. సాహిత్య చర్చకు స్త్రీ పురుష భేదాలేమిటి? మీరు పొరపడ్డారని నా అభిప్రాయం"

"ఆ నాయిక అలా చేయదని యెలా చెప్పగలరు"?

"అలాగే చేస్తుందని మీ రెలా చెప్పగలరు?"

"అందుకనే మానవ ప్రవృత్తులకు కారణం పరిస్థితుల ప్రభావం మూలం అన్నాను. వాతావరణం పాత్రలను నడిపిస్తుంది. వాతావరణ శక్తి పాత్ర యొక్క మానసిక విలువనుబట్టి ప్రవృత్తి బలాన్నిబట్టి పనిచేస్తుంది."

రత్న మాట్లాడకుండా నవ్వింది. అతను ముందే నవ్వాడు.

"మీ నాటకల్లోని నాయకుని పాత్రలను చాలా ఉదాత్తంగా పోషించారు. అటువంటి ఆదర్శాలు ఆశయాలు ఆచరణలో పెట్టగల సహృదయులు—అటువంటి మహత్తర త్యాగశీలాలుగల ఉన్నతులు వున్నారనుకోనేకంటే—వూహించుకొన్నారనటం సహజమేమో!"

రత్న చేసిన విమర్శనకు ఆమెకుగల సాహిత్య ప్రియత్వానికి అబ్బురపోయాడు జగన్నాథం. విశ్వం అదృష్టాన్ని తలచుకొని లోలోపల కొద్దికొద్దిగా అసూయపడటం ప్రారంభించాడు.

"మీ కథల్లోని నాయకులకు మీ రంటగట్టిన మంచిగుణాలన్నీ మీ సొంతగుణాలే అంటారు మావారు." ముత్యాలతొలకరిగా నవ్వింది రత్న. ఆమె నవ్వులు చూపులు క్రమంగా మరోలా అర్థంకావటం ప్రారంభించాయి జగన్నాథానికి. అటువంటి నీచ భావన చేసినందుకు మొదట కించపడ్డాడు. కాని ఒక వాస్తవిక రచయితగా ప్రకృతి వ్యక్తులను శక్తులను అర్థంచేసికోగల కవిగా — పేరుపొందిన మానసిక రచయితగా, రత్నను అర్థంచేసికోవటం ప్రారంభించాడు.

"రండి! మీ మిత్రులు యీ మధ్య వ్రాసిన చిత్రాలు చూద్దురుగాని" అంటూ లేచింది. వెనకాలే బయలుదేరాడు. ప్రపంచంచేత ప్రశంసలందిన ప్రఖ్యాత చిత్రకారుడు విశ్వం. అతని లేఖినిలో రేఖాప్రపుల్లత-భావగాంభీర్యం-వర్ణలావణ్యం చూచి యెంతో మురిసిపోతాడు జగన్నాథం. ఆబాల్యమిత్రులయిన ఆ యిద్దరూ కళాకారులు కావటం అదృష్టం అంది రత్న. అవునన్నాడతను.

వర్ణచిత్రాలు - తైలచిత్రాలు - పూర్తయినవీ కానివీ-ఆల్బమ్స్-అన్నీ చూపించింది. మురిసిపోతూ పరీక్షించాడు జగన్నాథం.

"మీ కథల్లోని మగాళ్ళచేత అలా వాగిస్తారు. మీరు మాట్లాడరేమండీ?"

"నా కథల్లోని ఆడవాళ్ళు మీలాగ యెప్పుడూ యేమగాడినీ యిలా ప్రశ్నించలేదు"

"అందుకని—"

"—అనేక తరహాలవ్యక్తు లుంటారు"

పెట్టెలోనుంచి ఒక అసంపూర్ణ తైలవర్ణ చిత్రాన్ని తీసి "ఇది పోటీకోసం వ్రాస్తున్నారు" అని చూపించింది. జగన్నాథం శరీరం నిలువునా గగుర్పొడిచింది. ఆ చిత్రంలో నగ్నంగా వున్న స్త్రీమూర్తిని చూస్తూ తాను ప్రత్యక్షంగావున్న రత్ననే నగ్నంగా చూస్తున్నట్లు సిగ్గుపడ్డాడు. ఈ చిత్రానికి యీమెనే మోడలుగా తీసుకొన్నాడా ఆర్టిస్టు? ఇందుకేనా యీమెను లేవదీసుకొచ్చాడు? అతని ముఖంవంక చూచి నవ్వింది రత్న. ఆ నగ్నచిత్రాన్ని చూచి మగాడైన తానే అంత సిగ్గుపడుతూ వుంటే తానలా నవ్వటం దేమిటి? పైగా పరాయిమగవాడి ప్రక్కను నిలబడి చూస్తూనా? కంగారుపడ్డాడు జగన్నాథం.

"ఇది చూడండి! వరూధిని ప్రవరుని దారి నడ్డగిస్తూవుంది" అంటూ మరొక చిత్రం చూపించింది. ఈసారి ఆమె బుజం అతని జబ్బకు ఆనుకొని వుంది. ఆ సంగతి ఆమెకు తెలిసి కూడా ఆమె దూరంగా జరగలేదని జగన్నాథం నమ్మకం. ఇక బొమ్మలు చూచే పరిస్థితిలో లేడతను. అక్కడనుంచి యెప్పుడు బయటపడదామా అని తహతహలాడిపోతున్నాడు. చిత్రాలు చూడటం పూర్తయి

బయటకు వచ్చేస్తూ వుండగా అరటిపండు తొక్కమీద అడుగు వేసి కాలుజారి వెనకాలే వున్న జగన్నాథం మీద పడ్డదామె. కాలుజారిపడ్డ అబలను-అందులోనూ తనమీద పడ్డ నిస్సహాయను పట్టుకోకుండా యేను గా డుంటాడు? అలాగే పట్టుకొన్నాడు జగన్నాథం. మరొక అయిదు నిమిషాల్లో హాల్లోకి తిరిగి వచ్చాక సోఫాలో వున్న తన తోలుసంచీ తీసికొని "సెలవు" అన్నాడు జగన్నాథం తడబడుతూ!

"ఎక్కడకు వెళతారు?"

"విశ్వం వచ్చాక మళ్లా వస్తాను"

"అంతవరకూ—?"

"హోటల్లో—"

"వీల్లేదు. ఇక్కడే వుండాలి" చటుక్కున అతని చేయిపట్టుకొని సంచీ లాక్కుంది. "మిమ్మల్ని యిలా వెళ్లిపోనివ్వటమే! ఆయన కోప్పడరూ? మా యింటికి వచ్చి హోటల్లో వుంటారా? భలేవారే!" అంటూ యింత లేసి కన్నులు చేసి వెటకారంగా చూచింది రత్న. జగన్నాథం మాట్లాడ లేదు.

"ఒక్క గంటసేపలా బీచీకి వెళ్ళిరండి. ఇంతలో వంటచేస్తాను." అంటూ అతని సమాధానంకోసం ఎదురు చూడకుండానే వంటయింట్లోకి నడిచింది రత్న. జగన్నాథం వీధి వెంట నడుస్తూ పరిపరి విధాల ఆలోచిస్తున్నాడు. ఆ రాత్రికి యే హోటల్లోనో గడిపి వేయాలనుకొన్నాడు. కానీ హృదయంలోని యే మూలనుంచో యేదో శక్తి బలవంతంగా వ్యతిరేకిస్తూవుంది. మన స్తత్వాన్ని పరీక్షించాలని అటువంటి విచిత్రపాత్ర ద్వారా యెన్నో నేర్చుకోవాలని పైగా తన ధైర్యం మీద నిగ్రహంమీద తనకు చాలా నమ్మక ముందని యింకా యేమేమో ఆలోచిస్తూ తిరిగి తిరిగి రాత్రి యెనిమిదింటికి యింటికి వచ్చాడు జగన్నాథం. అప్సరసలా అలంకరించుకొని తనకోసం యెదురు చూస్తున్న రత్నను చూస్తేగాని తాను తిరిగి అక్కడకే వచ్చానన్న సంగతి గుర్తించలేకపోయాడు జగన్నాథం.

"అబ్బా! యింతసేపు యెక్కడున్నారండి. తువ్వాలు కట్టుకోండి. స్నానం చేద్దురుగాని" అంటూ తువ్వాలందించి మరో తువాలు సబ్బుతొట్టి పట్టుకొని బాత్ రూమ్‌కు నడిచింది. జగన్నాథం రక్తనాళాలు అవయవాలు అతను గాకుండా ఆమె చెప్పినట్లుగానే పనిచేయటం ప్రారంభించాయి. ఆసంగతి గుర్తించి కూడా తెలియనట్లుగా వూరుకున్నాడతను.

భోజనందగ్గర మరీ అల్లరిచేసింది రత్నకుమారి. వద్దంటున్నా వినకుండా చేయిపట్టుకుని ఆపినా ఆగకుండా యేమిటావడ్డన? జగన్నాథం విసుక్కున్నాడు. అతని మనసుమాత్రం నవ్వుకుంది. భోజనాలయ్యాక చిలుకలు చుట్టి తమలపాకు లందించింది.

దశమిచంద్రుడు వెన్నెల పన్నీరు చల్లచల్లగా జల్లుతున్నాడు. అతను వరండాలో పడుకొన్నాడు. ఆమె గదిలో పడుకొంది. మధ్య తలుపులు తెరచే వున్నాయి. అయినా ఒకరి కొకరు కనిపించరు. లైటులన్నీ ఆర్పేసింది. బయట వెన్నెల; ఇంట్లో మందమైన చీకటి.

"ఏమండీ నిద్రపట్టిందా?"

"లేదు."

నవ్వింది. అతని గుండెలు దడదడ లాడాయి.

"మీకథలు నాకు బాగా నచ్చుతాయి."

"ధన్యవాదాలు"

"మీకథల్లో అర్థంకాని ఆకర్షణవుంది."

అతను మాట్లాడ లేదు. ఆమెకూడా కాస్సేపు వూరుకొని మరలా అంది.

"మీరు స్త్రీ హృదయాన్ని బాగా అర్థం చేసుకున్నారు. ఇదంతా మీ అనుభవమా?"

అతను మాట్లాడ లేదు.

"మీరు మీ స్నేహితుని తిడుతూ వ్రాసిన ఉత్తరం మీకు జ్ఞాపక ముందా?"

"ఉంది."

"అన్ని నీతులు మీ కెలా తెలిశాయండీ?"

అతను మాట్లాడ లేదు.

"మీ రచనలను బట్టి మీ ఉత్తరాన్ని బట్టీ చూస్తూ వుంటే మీరు సాక్షాత్తూ ఋషిపుంగవుడిలా కనుపిస్తారు. ఎంత నిగ్రహం. యెంత ధైర్యం—యెంత పట్టుదల. అందుకనే యెన్నాళ్లనుంచో మిమ్మల్ని చూడాలని —మాట్లాడాలని యెదురుచూస్తున్నాను. మే మిద్దరం పిరికివాళ్లం. కాబట్టే మనసును అదుపులో పెట్టలేక యిలా చేశాం. మీ రయితే...అబ్బో మీకథల్లోని నాయకుల్లాగ సాక్షాత్తూ బ్రహ్మపదార్థ మేగా!"

అతను మాట్లాడలేదు.

"రాక రాక మీరు రావటం — మీ మిత్రులు లేకపోవటం — మీ కిష్టం లేని నేనొక్కర్తె నే వుండటం విచిత్రంగా వుందికదూ."

ఈసారి కూడా అతను మాట్లాడలేదు.

"ఈ వెన్నెలను మీరెలా వర్ణిస్తారు ?"

అతను మాట్లాడలేదు.

"నిద్రపట్టిందా ?"

"అవును !"

అతని సమాధానం పచ్చి అబద్ధమని యిద్దరకూ తెలుసు. నిద్రపోయేవాడు నిద్రపోతున్నానని సమాధానం యెలా చెపుతాడు! అందుకనే నవ్వింది రత్న. మలేరియాజ్వరం వచ్చినవాడిలా గడగడలాడాడు జగన్నాథం. నిజానికి యెంత ప్రయత్నించినా రెప్ప వాలటంలేదు జగన్నాథానికి.

"ఏమిటి యీ మనిషి ప్రకృతి? యేమిటి యీ ప్రవృత్తి! లేచివచ్చినదాని బుద్ధి... అయినా రసవత్తర కళాఖండానికి కథానాయిక కాదగిన లక్షణాలన్నీ వున్నాయి రత్నకుమారికి! అయితే యీ సన్నివేశం యెలాముగుస్తుంది — యీ సంయోగంయొక్క ఫలిత మేమిటి?" ఇలా యెంతసేపు ఆలోచించాడో తెలియదు. మాగన్నుగా కునుకు పట్టింది.

సుమారు రాత్రి రెండుగంటలవేళ జగన్నాథం త్రుళ్లిపడి లేచాడు. చూశాడు. ఏమీ లేదు. లేచి మంచంమీద కూర్చుని చుట్టూవెదికాడు. ఎవ్వరూ లేరు. అప్పటికే చంద్రుడస్తమించటంవల్ల అంతా చీకటిగావుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా రత్న జ్ఞాపకంవచ్చింది. ఉవ్వెత్తుగా లేచి మంచందిగి మత్తుమత్తుగానే తిన్నగా రత్నకుమారి మంచందగ్గరకు వెళ్లాడు. ఆమె మైమరచి నిద్రపోతూవుంది. మీద చేయివేశాడు. ఆమె మాట్లాడలేదు. రెండు చెంపలనూ అరచేతుల్లోకి తీసుకొని ముందుకువంగాడు! అప్పటికీ ఆమెలో చలనం కలగలేదు. ఆ నాలుగు పెదవులకు మధ్య యింక ఒక్క అంగుళం అంతరం వుందనగా "ఎవరూ" అంటూ త్రుళ్లిపడి లేచికూర్చుంది రత్న. బిత్తరపోయి "నేను రత్నా" అని చాలినంత మెల్లగా అన్నాడు జగన్నాథం.

"అఁ! మీరా! ఏమిటేపని ?"

గడగడలాడి పోతున్నాడు జగన్నాథం!

"అన్నయ్యా! జీవితానికీ రచనలకూ యింత వ్యత్యాసముంటుందని యెప్పుడూ అనుకోలేదు. మీరు మీ మిత్రుని తిడుతూ వ్రాసిన పదిపేజీల ఉత్తరంలో మే మిద్దరం మనసు వదుసుకొని బలహీనుల మన్నారు. మాకు కావలసింది మేము నిర్భయంగా చేశాం. నిజాయితీగా బ్రతుకుతున్నాం! ఎవరు బలహీనులు మీరా మీ స్నేహితులా ? మీ ఉత్తరంలో మీరు బోధించిన నీతులన్నీ మాపిల్లలకు బోధించాలని ఆ వుత్తరాన్ని ప్రాణప్రదంగా దాచాం! ఇంత బలహీనమైన హృదయంలోని ఆశయాలు మా కెందుకు! మీ ఉత్తరాన్ని మీరే పట్టుకువెళ్లండి" అంటూ ట్రంకుదగ్గరకు వెళ్లి లైటువేసి ట్రంకు తెరచి ఉత్తరం తీసి ఇటుతిరిగి "యిదిగో" అంది. కానీ అక్కడ జగన్నాథం లేడు. వరండాలోనూ హాల్లోనూ వెదికింది యెక్కడా లేడు. వీధితలుపులు తెరచివున్నాయి. త్వరత్వరగా వెళ్లి చూచింది. వీధిలో కూడా లేడు. మెట్లు దిగి రోడ్డుమీదికి వచ్చి చూచింది. వీధి చివర మలుపులోవున్న వీధి లైటు కాంతిలో స్పష్టంగా కనుపించాడు జగన్నాథం! లాల్చీ తొడుక్కోకుండా బుజంమీద వేసికొని — తోలుసంచీ చంక నెట్టుకొని తలవంచుకొని చటుక్కున మలుపు తిరిగిపోయాడు జగన్నాథం.